



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పకడ్బందీగా పి-4 సర్వే


కలెక్టర్ డా॥వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పి-4 మోడల్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ డా॥వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని 41వ వార్డు సచివాలయం పరిధిలో ఉన్న వెంకటేశ్వర నగర్‌లో పి-4 మోడల్ సర్వేను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఇందులో భాగంగా సర్వేలో ఏదైనా సందేహం ఉందా, ఎందుకోసం ఈ సర్వే చేస్తున్నారన్న విషయాలను ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించేందుకు పి-4 సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలను అందించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని, పి-4 మోడల్ సర్వే గురించి ఇతరులకు తెలియజేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ సర్వే వేగంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలరాజు, ఎంహెచ్ విష్ణుమూర్తి, వార్డు అడ్మిన్ సెక్రటరీ సరోజ, వార్డు రెవెన్యూ సెక్రెటరీ రోజ పాల్గొన్నారు.

కూటమి నేతల భూ పంచాయితీ

జిల్లాలో కూటమి పార్టీలైన టిడిపి, బిజెపి నేతల మధ్య భూ పంచాయతీ తారా స్థాయి చేరుతోంది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు భాగస్వాముల మధ్య గత కొన్ని రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది. 250 ఎకరాల భూ పంచాయతీ గడిచిన పదేళ్లుగా ఆ నేతల మధ్య నానుతూనే ఉంది. ఇందులో భాగస్వాములుగా ఉన్న ముఖ్య నేతలు మాత్రం ఇప్పటి వరకు మౌనం వీడలేదు. తమకేమీ సంబంధం లేనట్టుగానే వ్యవహారాన్ని నడిపిస్తున్నారు.



- ◆ భాగస్వాముల మధ్య సాగుతున్న మాటల యుద్ధం
- ◆ ఎవరికి వారు తమదే అంటూ ప్రకటనలు
- ◆ ముఖ్య నేతల మౌనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లా పెనుకొండ మండల పరిధిలోని గుట్టూరు గ్రామ పరిధిలో 250 ఎకరాల భూమిని 2011 గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీ పేరుతో ఉత్తరాదికి చెందిన వ్యక్తులు కొనుగోలు చేశారు. ఈ కంపెనీ నుంచి 2014లో ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ మొదట అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ కొనుగోలు నడుస్తున్న క్రమంలో ఈ ప్రాంతంలో కియా పరిశ్రమ వస్తుందని భావించి తెలుగుదేశం పార్టీ అప్పటి మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బిజెపి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డిలు 2016లో గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీ కొనుగోలుకు ముందుకొచ్చారు. ఆదినారాయణతో కలసి ముగ్గురు భాగస్వాములుగా కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో పల్లె రఘునాథరెడ్డి 40 శాతం వాటా, ఆదినారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డిలు చెరి 30 శాతం వాటాతో ఉత్తరాది వ్యక్తులు డబ్బులు చెల్లించి సంస్థతోపాటు, ఆ సంస్థ పేరుమీదున్న 250 ఎకరాలను తమ పేరుపై మార్చుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ సంస్థలు డబ్బులు చెల్లించడంలో ఆర్థికపరమైన సమస్యలు తలెత్తడంతో హైదరాబాద్‌కు సంబంధించిన కొంత మంది వ్యక్తులను ఇందులో భాగస్వాములు చేయాలని భావించారు. వారి వల్ల కూడా కాకపోవడంతో 2017లో ప్రభాకర్ అనే వ్యక్తిని సంప్రదించారు. అతను ముందుకు రావడంతో కంపెనీలో ఆయన్ను డైరెక్టర్‌గా నియమించుకున్నారు. ఆ తరువాత అక్కడ భూముల ధరలు పెరగడంతో భాగస్వాముల మధ్య వివాదాలు తలెత్తాయి. 2018 నుంచి భాగస్వాముల మధ్య వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. అనేక మార్లు స్థలం వద్దనే ఘర్షణలకు దిగిన సందర్భాలూ ఉన్నాయి.

ముఖ్య నేతల మౌనం

ఈ భూ వివాదం విషయంలో ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ, భాగస్వామి ప్రభాకర్‌లు ఇటీవలి కాలంలో పరస్పరం మీడియా సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఆరోపణలు చేసుకుంటున్నారు. ఆరోపణలు చేస్తున్న ఆది నారాయణ బిజెపి పార్టీలో ఉన్నారు. ఆయన ఆరో పణలు చేస్తున్నది టిడిపి నాయకులు పల్లె రఘునాథ రెడ్డిపై కావడం గమనార్హం. మరో నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి బిజెపిలో ఉన్నారు. ఈ రకంగా అటు టిడిపి, ఇటు బిజెపి భాగస్వాములుగా ఉన్న ఈ నేతల మధ్య భూ పంచాయితీ తారా స్థాయిలోనే నడుస్తోంది. ఇప్పటి వరకు ఈ విషయంపై ఆదినారాయణ, ప్రభాకర్‌లే పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటు న్నారు. ముఖ్య నేతలు మాత్రం ఈ విషయంపై ఏమీ స్పందించకపోవడం గమనార్హం. అనేక ఏళ్లుగా నడుస్తున్న ఈ భూ పంచాయతీకి ఫుల్‌స్టాప్ పెట్టే పరిస్థితులు కూడా లేకుండా ఉన్నాయి.

నేడు గ్రూప్-2 పరీక్షలు

షెడ్యూల్ ప్రకారమే నిర్వహణ-కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం ఆదివారం నాడు యథాతథంగా జరుగుతాయని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ, గ్రూప్-2 మెయిన్స్ వాయిదా అంటూ సోషల్ మీడియాలో జరుగుతోన్న తప్పుడు ప్రచారం నమ్మొద్దని, ఏపీపీఎస్సీ నుంచి అందిన సమాచారం మేరకు గ్రూప్-2 పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా జరుగుతాయని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 జరుగుతుందని కమిషన్ తెలిపిందని తెలిపారు. అభ్యర్థులు 15 నిమిషాలు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించాలి

డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి.దేవి సూచించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సినిమా థియేటర్లు, ఆకాశవాణి రేడియో దినసరి కార్యక్రమ ప్రసారాల్లో ఆయా కార్యక్రమాల విరామం మధ్యలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై తయారు చేసిన వీడియోలు, క్లిప్పింగులను ప్రసారం చేయాలన్నారు. ఆడపిల్లల పుట్టుకను పెంచే విధంగా చర్యలు తీసుకోవడంలో భాగంగా కమిటీ సభ్యుల సమక్షంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవిశంకర్, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ నిస్సార్‌బేగం, డాక్టర్ రవికుమార్, డాక్టర్ దీప్తి, డెమో త్యాగరాజు, గురుస్వామి, ఆర్డీటీ అధికారి డాక్టర్ హరిణి, వేణు, వెంకటేష్, కిరణ్, శ్రీకాంత్, లీగల్ అడ్వైజర్ ఆషారాణి, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రండి.. హెచ్చెల్సీ లైనింగ్‌పై పోరాడుదాం..

రైతులకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి పిలుపు

ప్రజాశక్తి-ఆత్మకూరు

'రైతు బిడ్డలారా ఆలోచించండి.. ఇప్పుడు మౌనంగా ఉంటే రానున్న రోజుల్లో పెను ప్రమాదాన్నే ఎదుర్కొంటాం.. రండి.. హంద్రీనీవా కాలువలో లైనింగ్‌కు వ్యతిరేకంగా పోరాడుదాం..' అంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని శింగంపల్లి, శింగంపల్లి తండా, కొత్తపల్లి, పంపనూరు, తలుపూరు, వడ్డుపల్లి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీడిపల్లి నుంచి హంద్రీనీవా మొదటిదశ కాలువను వెడల్పులో భాగంగా లైనింగ్ చేస్తున్నారన్నారు. కాలువలో అరడుగు మందంతో కాంక్రీట్ ప్లాస్టింగ్ చేస్తే చుక్క కూడా భూమిలోకి నీరు ఇంకదన్నారు. ఇదే జరిగితే రాబోయే రోజుల్లో పెనుప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత మినహా తక్కిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు లైనింగ్ పనులను వ్యతిరేకిస్తున్నారన్నారు. లైనింగ్ వల్ల భూమిలోకి నీళ్లు దిగకపోతే చుట్టుపక్కల బోర్లు ఎండిపోతాయన్నారు. కావున రాజకీయాలతో సంబంధం లేకుండా అందరూ కలిసికట్టుగా రండి... లైనింగ్‌కు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. లైనింగ్ విషయంలో రాజీపడే ప్రసక్తేలేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కాలువ పనులను వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.

సాగును సులభతరం చేస్తాం

ప్రజాశక్తి -రాప్తాడు

వ్యవసాయ సాగును సులభతరం చేసి, రైతుకు మేలు చేసేలా ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటును అందిస్తోందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితతో పాటు పలువురు ఎమ్మెల్యేలు తెలియజేశారు. రాప్తాడు సమీపంలో రైతుబడి సంస్థ అగ్రి ఎక్స్ పో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రైతుబడి వ్యవస్థాపకులు రాజేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో సుమారు 300 కంపెనీలు పాల్గొన్నాయి. 700 అత్యాధునిక వ్యవసాయ పరికరాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఆధునిక వ్యవసాయం.. ఎరువుల వాడకం.. తదితర అంశాలను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, అమిలినేని సురేంద్ర, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ధర్మవరం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో పాటు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ అనంతపురం జిల్లాను ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చడమే కాకుండా హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. గత ఐదేళ్లలో రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని జగన్ ఇప్పుడు ఏదో రైతులపై ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ సాంప్రదాయ వ్యవసాయానికి ఆధునికత జోడిస్తూ సాగును సులభతరం చేయడమే కాకుండా రైతులకు మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతు బడి అగ్రి ఎక్స్ పో కార్యక్రమాన్ని నిర్వహించిన రాజేందర్ రెడ్డిని ఆయన అభినందించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ సాంప్రదాయ వ్యవసాయానికి సాంకేతికత జోడించి అధిక దిగుబడులు, రైతులకు లాభం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ సాంప్రదాయ వ్యవసాయానికి సాంకేతికత జోడించి అధిక దిగుబడులు, రైతులకు లాభం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండు రోజుల పాటు జరిగే ప్రదర్శనను ప్రతి రైతు సందర్శించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాడు రైతు సంక్షేమం దిశగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చేలా అన్ని ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ, ఏడీ ఎ.మీనల రవి, ఉద్యాన వన శాఖ అధికారులు ఫిరోజ్ ఖాన్, యుగంధర్ రెడ్డి, రాప్తాడు ఏవో శ్రీవాణి, ఉమ్మడి జిల్లా రైతులు పాల్గొన్నారు.

రైతు బడి అగ్రి ఎక్స్‌పోలో మంత్రి, ఎమ్మెల్యేలు

రాప్తాడు సమీపంలో రైతు బడి అగ్రి ఎక్స్ పోకు స్పందన

వేలాదిగా తరలొచ్చిన రైతులు



మామిడి మొక్కలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు...

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రస్తుత పరిస్థితుల్లో అధికంగా చోటు చేసుకుంటున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావడమే లక్ష్యమని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. 'సైబర్ సురక్ష' (మన భద్రత- మన బాధ్యత) కార్యక్రమంలో భాగంగా శనివారం పోస్టర్లు అతికించిన ఆటోల ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాల ముందున్న మైదానంలో దాదాపు 200పైగా ఆటోలకు పచ్చజెండా ఊపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ 10 రోజుల నుంచి సైబర్ సేఫ్ అనంతపురం కోసం సైబర్ సురక్ష కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నిరక్షరాస్యుల నుంచి ఉన్నత చదువులు చదివిన వారి వరకూ సైబర్ నేరాలపై అవగాహన కల్పించమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా అనంతపురంలో 40 హోర్డింగులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతపురంలోని ప్రముఖ కూడళ్లలో ఉంటున్న ట్రాఫిక్ పోలీస్ గొడుగులపై సైబర్ మోసాలపై అవగాహన చేస్తూ తయారు చేయించిన స్టిక్కర్లు అతికించినట్లు తెలిపారు. ఒకవేళ సైబర్ మోసగాళ్ల బారిన పడితే వెంటనే మౌనం వీడి సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు, సైబర్ క్రైమ్ పోర్టల్ www.cybercrime.gov.in ఫిర్యాదు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సిఐలు షేక్ జాకీర్, కనుమూరి సాయినాథ్, శ్రీకాంత్ యాదవ్, రఘుప్రసాద్, విద్యార్థులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహనా ఆటోలను ప్రారంభిస్తున్న ఎస్పీ పి.జగదీష్

అప్పులు ఫుల్.. అభివృద్ధి నిల్..

కూటమి ప్రభుత్వంపై వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఫైర్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పులు ఫుల్.. అభివృద్ధి నిల్ అన్న చందంగా మారిందని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ ఎద్దేవా చేశారు. శనివారం అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలలు కాలంలోనే దాదాపు రూ.లక్ష కోట్లు అప్పు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ పూర్తిగా నాశనమైందని మండిపడ్డారు. ప్రభుత్వం లక్ష కోట్లు అప్పు చేసినా విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఒకేషనల్ ట్రైనింగ్ టీచర్ల జీతాలు కూడా సమయానికి ఇవ్వడం లేదన్నారు. అంతేగాకుండా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా వైసిపి హయాంలో అమలు చేసిన పథకాలను ఆపేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంతోపాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి విద్యాభివృద్ధికి పాటుపడాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు కైలాష్, నాయకులు మల్లెల పవన్, నిశాంత్‌రెడ్డి, బాబా, శేఖర్, నాని, వంశీ, చెన్నకేశవ, రాహుల్‌రెడ్డి, వెంకట్, సాయి, ఇమ్రాన్, మోహన్, రమేష్, వీరా, రమణ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా నాయకులు పెద్ద ముష్టూరు వెంకటేశులు కోరారు. శనివారం మండలంలోని పెన్నహోబిలం ఆలయ ఇఒ సాకే రమేష్‌కు కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. కొంతమందికి గుత్త రసీదులు ఇవ్వలేదన్నారు. గుత్త రసీదు ఇస్తే సిసిఆర్‌సి కార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కావున వెంటనే గుత్త రసీదులు ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన ఇఒ పెండింగ్‌లో ఉన్న వారందరికీ గుత్త రసీదులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సి.నారాయణస్వామి, బి.సుధాకర్, సి.ఆదినారాయణ, బి.నాగరాజు, ఓబులేసు, మారుతి, రఘురాములు, తదితరులు పాల్గొన్నారు.



పెన్నహోబిల ఆలయ ఇఒతో మాట్లాడుతున్న కౌలురైతులు

పూర్వ విద్యార్థుల అనుభవాలే మార్గదర్శకం

ఇసిఇ విభాగాధిపతి జి.మమత

ప్రజాశక్తి-అనంతపురం

పూర్వ విద్యార్థులు అనుభవాలే ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకాలు అని జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఇసిసి విభాగాధిపతి జి.మమత అన్నారు. శనివారం స్థానిక ఇసిఇ విభాగంలో ఇసిఇ విభాగం పూర్వ విద్యార్థుల రీ యూనియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుని ప్రేరణనిచ్చారు. ఈ సందర్భంగా జి.మమత, ఏచో ఫ్యాకల్టీ అడ్వైజర్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకోవడం ప్రస్తుత విద్యార్థులకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఎఫ్ నుంచి మనోహర్, అశోక్, గోల్డ్‌మెన్ నుంచి గిరీశ్‌రెడ్డి, ఎఎండి నుంచి శ్రీ వివాష్, ఇన్ఫోని నుంచి జావీద్, అమెజాన్ నుంచి జస్వంత్‌రెడ్డి, ఇస్రో శాస్త్రవేత్త చందనా, క్వాల్కమ్మ్ నుంచి తరుణ్, మాజీ ప్రొఫెసర్ ఎంఎన్.గిరిప్రసాద్, ప్రొఫెసర్ వి.సుమలత, ఎస్.అరుణ మస్తానీ, తదితరులు పాల్గొన్నారు.



జెఎన్‌టియు ప్రస్తుత విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

గ్యాస్ కార్యాలయాల్లో తనిఖీలు

నార్పల : మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ కార్యాలయంలో సివిల్ సప్లయ్ జిల్లా అధికారి జగన్మోహన్‌రావు శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే నార్పల భారత్ గ్యాస్ కార్యాలయాన్ని తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో నార్పల సిఎస్‌డిటి చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : స్థానిక సహస్ర భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని సిఎస్‌డిటి రాజశేఖర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అదనపు వసూళ్లకు పాల్పడకుండా గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని సూచించారు. అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకాలు మంజుల, గ్యాస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న సిఎస్‌డిటి రాజశేఖర్

చెత్త సేకరణపై 'ప్రత్యేక డ్రైవ్'

జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు

ప్రజాశక్తి-అనంతపురం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, అదనపు కమిషనర్ సుధాకర్‌రావు ఆదేశాల మేరకు ఇంటింటి చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. శనివారం నగరంలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల గ్రామ పంచాయతీల్లో చెత్త నిల్వ లేకుండా పరిశుభ్రత కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలు చెడు, తడి, పొడి చెత్తను ప్రత్యేక బ్యాగుల్లో ఉంచి ఉదయం మీ ఇళ్ల వద్దకు వచ్చే కార్మికులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంపై మహిళలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జిల్లాలోని 522 పంచాయతీల్లో చెత్తను నిల్వ చేసి వర్మీకంపోస్టు తయారు చేసే కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ ఎరువులు పంటలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.



జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు

ప్రజాశక్తి
www.prajasakti.com

మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి

గుత్తి : ప్రతి ఒక్కరూ మానసిక, శారీరిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా ఆర్గనైజేషన్ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ స్కౌట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ లో విద్యార్థులు చేరాలని కోరారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన యోగాసనాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలు చేయాలి

గుత్తి : ఇంటి, ప్రయివేట్ కొళాయిల పన్నులను ప్రజల నుంచి 100 శాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా ఆదేశించారు. శనివారం స్థానిక పురపాలక సంఘం పరిధిలోని పన్నుల వసూలు బందం చేపట్టిన ప్రగతి నివేదికలను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కొళాయిలను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. వాణిజ్య లైసెన్సు, ఖాళీ స్థలాలపై పన్నులు వసూలు అయ్యేలా చర్యలు చేపట్టాలని నోడల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రజలు ఆస్తి పన్నులను చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి.రాంబాబు, రెవెన్యూ అధికారి కమలాకర్ సతీష్, ఆర్ఐ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

ఆత్మకూరు : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం అనంతపురం జిల్లాకేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రెడ్డిసంఘం జిల్లా అధ్యక్షుడు పాటేల్ రామకృష్ణారెడ్డి, నాయకులు చవ్వా హనుమంతురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఫైర్ కృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

రైతుసంఘం నాయకుల వినతి



జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మకు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-రాప్తాడు

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ ప్రదర్శనలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందులు విక్రయించిన రైతులకు వెంటనే ఖాతాలకు నగదు జమ చేయాలన్నారు. ఇప్పటికే అతివృష్టి, అనావృష్టి కారణంగా వల్ల పంట దిగుబడి తగ్గిందన్నారు. వచ్చిన అరకొర కంది దిగుబడిని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిందన్నారు. కావున వారందరికీ వెంటనే ఖాతాలకు నగదు జమ చేయాలని కోరారు. కంది పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు పంట నష్టపరిహారం ప్రకటించాలన్నారు. 2024-25 ఖరీఫ్, రబీలో సాగు చేసి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం ఎం.పోతలయ్య, జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు పోతలయ్య, రెడ్డిపల్లి శ్రీనివాసులు, సుబ్బిరెడ్డి, సంజీవురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడిపై గృహ యజమాని దాడి

పోలీస్ స్టేషన్ ఎదుట సిఐటియు ధర్నా


పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని నాలుగో సర్కిల్ వేణుగోపాల్ నగర్‌లో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికుడు ఆదినారాయణపై గృహ యజమానురాలు శనివారం దాడికి పాల్పడింది. పారిశుధ్య పనులు చేస్తుండగా గీత అనే మహిళ కార్మికునిపై భౌతిక దాడి చేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కాలువపై అక్రమంగా వేసిన బండలు, ఇతర వస్తువులను తీసి వేయమని కార్మికుడు చెప్పడంతో గృహ యజమాని ఆగ్రహావేశంతో దాడికి పాల్పడిందన్నారు. భౌతికంగా ఆమె దాడి చేయడంతో దెబ్బలు తట్టుకోలేక అది నారాయణ కుప్పకూలి కింద పడ్డాడన్నారు. అడ్డుకున్న తోటి కార్మికులపైనా ఆమె దాడికి పాల్పడిందన్నారు. పోలీసులు ఘటనపై విచారణ చేసి దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, నగర అధ్యక్షులు ఎర్రిస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రెగ్యులర్ ఉద్యోగ కార్మిక సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు ఎల్.ముతురాజు తదితరులు పాల్గొన్నారు. ఈ ఘటనపై కమిషనర్ బాలా స్వామి స్పందించారు. పారిశుధ్య కార్మికులపై దాడి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోళ్లలో శ్రమదానం

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని గోళ్ల గ్రామంలో వాటర్‌షెడ్ యాత్ర -ప్రధానమంత్రి కృషి శించాయ యోజన 2.0లో భాగంగా ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఇందులో భాగంగా భూగర్భజలాల పెంపు, నేల, నీరు, వృక్షసంపదను సక్రమంగా వినియోగించడం ఎలా అనే అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

పుట్లూరు : విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయిస్తే విద్యలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మానసిక ఆరోగ్య కౌన్సిలర్ చిగిరేమేకల లక్ష్మీపతి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సెకండరీ, సీనియర్ సెకండరీ విద్యార్థులకు విద్యాపరమైన ఒత్తిళ్లు, డిప్రెషన్, పరీక్షల ఒత్తిడి, వ్యక్తిగత మానసిక సమస్యలపై విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు, టాబ్‌ల్లో ఆటలకు బానిస అవడం ద్వారా పరీక్షల అంటే భయం, ఒత్తిడి పెరుగుతోందన్నారు. వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గజ్జల ఓబుల్‌రెడ్డి, ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ నారాయణస్వామి, సభ్యులు పెద్దిరాజు, శివప్రసాద్, అమరనాథ్‌రెడ్డి, సూర్యనారాయణ, పీరాంబి పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

శింగనమల : రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగులగుడ్డం తండావాసులను వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ శనివారం పరామర్శించారు. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ సమీపంలో పెన్నానది వంతెన వద్ద బొలేరో వాహనం బోల్తా పడటంతో 11మంది కూలీలు గాయపడిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎస్టీ సెల్ నాయకులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.రవికుమార్‌నాయక్, డి.భాస్కర్‌నాయక్, రమేష్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, మోటోనాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74 ఉడేగోళం 132 కెవి సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఎబి స్విచ్‌లు ఏర్పాటు చేస్తుండటంతో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నిదనవాడలో వైద్యశిబిరం

శింగనమల : వ్యవసాయ కార్మిక సంఘం పోరాట ఫలితంగా శనివారం మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని గత శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వైద్యాధికారులకు వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్ నిదనవాడలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యం అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ గంగాధర్, సూపర్‌వైజర్ అశ్వర్థ నారాయణ, నాగమ్మ, రాధా, శ్వేత, వరలక్ష్మి, భారతి, నాగరాజు, నారాయణరెడ్డి, వలి, పెద్దన్న, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

శింగనమల : మండలంలోని గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి ఆదాయం సమకూర్చుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు సూచించారు. శనివారం మండలంలోనిచక్రాయపేట, కొరివిపల్లి గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను డిపిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు 22, 23వ తేదీల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలివచ్చి వర్మీ కంపోస్టు తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ పంచాయతీ అధికారి విజయకుమార్, పంచాయతీ విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనంతలో ఉమర్‌అలీషా జయంతి వేడుకలు

అనంతపురం : కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 140వ జయంతి వేడుకలను ఈనెల 28న అనంతపురంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా సాహితీ సమితి అధ్యక్షులు రియాజుద్దీన్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని లలితకళా పరిషత్తు వేదికగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరిగే వేడుకలకు పీఠం నవమ పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ ఆలీషా విశిష్ట అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

'బేసిక్ అప్లికేషన్స్'పై జాతీయ కాన్ఫరెన్స్



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాలలో 'బేసిక్ అప్లికేషన్స్ ఆఫ్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ (2025)'పై శనివారం ఒకరోజు జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలన్నారు. సాంకేతికంగా వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కీనోట్ స్పీకర్స్ ప్రొఫెసర్ పి.అబ్దుల్‌అజీమ్ మాట్లాడుతూ వైద్యరంగంలో లేజర్ విస్తృతంగా ఉపయోగపడుతోందన్నారు. లేజర్ టెక్నాలజీ అనేది కాంతిని అధిక శక్తి, నిర్దిష్ట దిశలో కేంద్రీకరించడం ద్వారా వివిధ వైద్యచికిత్సల్లో ఉపయోగపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.కరుణసాగర్, ప్రొఫెసర్ కె.రామగోపాల్, ఎల్.శివశంకర్‌రెడ్డి, ఎన్ఎవి.ప్రసాద్, ఎఒ శ్రీనాథ్, కోఆర్డినేటర్ ఎస్.పవన్‌కుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఎంబి జూలియస్ ఇస్సాక్‌రాజ్, ఎస్.పురుషోత్తం, ఐఐసి సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాలోత్సవ సంబరం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఈ వారం అనంత బాలోత్సవాలు పిల్లలకు పండుగను తెచ్చిపెట్టింది. అనంత బాలోత్సవాలు-5లో పిల్లలు ఎంతో ఉత్సహంగా పాల్గొన్నారు. చదువుల ఒత్తిడిలో ఇబ్బందులు పడుతున్న చిన్నారులకు మూడు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాలు కాస్త ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని ఇచ్చాయి. తమను ప్రోత్సహిస్తే కళల్లో ఎంతో ప్రతిభను చాటి చూపగలమని ఈ మూడు రోజుల ఉత్సవాల్లో పిల్లలు నిరూపించారు. ఉపాధ్యాయులతోపాటు, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఎంతో ఓర్పుతో ఇక్కడ జరుగుతున్న పోటీలకు తీసుకొచ్చారు. వేదికపై పిల్లలు చూపుతున్న ప్రదర్శనలను తిలికించి పరవశించారు. పిల్లలను ప్రతిభను చూస్తూ సంతోషపడడమే కాకుండా మొబైల్ ఫోనుల్లో వాటిని చిత్రీకరించుకుని ఆనందించారు. పిల్లల పండుగలా జరుగుతున్న ఈ వేడుకల్లో పెద్దలూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

జిల్లాలో చదువుల ఒత్తిడితో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషాధ ఘటన కూడా చోటు చేసుకుంది. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి ఎస్ఆర్ కళాశాల వెనుకవైపు తోటలోకెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువుల ఒత్తిడితోనే ఇది జరిగినట్టు భావిస్తున్నారు. అంతకు మునుపు నెలలో నారాయణ కళాశాలలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వరుసగా రెండు మాసాల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం విషాదకరం. చదువుల ఒత్తిడితో ఒకటి జరగ్గా, ఫీజు ఒత్తిడితో ఒకటి జరిగింది. ఇక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తమకు రక్షణ లేదని విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. కొత్తగా ఏర్పాటైన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఇప్పటికి పూర్తి స్థాయి మౌలిక సదుపాయల కల్పన జరగలేదు. కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపుల్లో ఈ విశ్వవిద్యాలయంపై సీతకన్ను వేసింది. దీంతో పనులు నత్తనడుకన సాగుతున్నాయి. ఈ పనులు జరుగుతున్న సమయంలోనే విద్యార్థులను అక్కడ చేర్చారు. దీంతో విద్యార్థినులకు భద్రత లేకుండాపోయింది. దీంతో ఆందోళన చెందుతున్నారు. తమకు రక్షణ కల్పించాలని నిరసనలకు దిగాల్సి వస్తోంది. అక్కడికి ఎంపి అంబికా లక్ష్మినారాయణ వెళ్లి పరిశీలించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో చూడాల్సి ఉంది. కేంద్ర బడ్జెట్‌లోనూ వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించలేదు. ఈ విశ్వవిద్యాలయానికి ఒక్క రూపాయి నిధులివ్వలేదు. ఈ ఆందోళనలతోనైనా స్పందిస్తుందో లేదో చూడాల్సి ఉంది.

నేడు జై విష్ణు ఆసుపత్రి ప్రారంభం




నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనం, మేనేజింగ్ డైరెక్టర్లు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని సాయినగర్ 3వక్రాస్‌లో నూతనంగా నిర్మించిన జై విష్ణు ఆసుపత్రిని ఆదివారం లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ భరత్ విష్ణురెడ్డి, డాక్టర్ లీలాపద్మిని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా అనంతపురం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించినట్లు చెప్పారు. వారి ఆదరణతో ఆధునిక సౌకర్యాలతో పూర్తిస్థాయి న్యూరో, ఆప్తమాలజీ వైద్యసేవలతో వస్తున్నట్లు తెలిపారు. 25 బెడ్లతోపాటు ఆధునిక హంగులతో ఆసుపత్రిని నిర్మించామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి జెసి దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జెసి ప్రభాకర్‌రెడ్డి, పలువురు ప్రముఖులు, అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

నిసార్ కుటుంబానికి మందకృష్ణ పరామర్శ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సంఘం నాయకుడిగా సేవలందించి జనవరి నెలలో మృతి చెందిన నిసార్ అహమ్మద్ కుటుంబ సభ్యులను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ శనివారం పరామర్శించారు. నిసార్ మందకృష్ణతో కలిసి పని చేసిన నేపథ్యంలో ఆయన ఆ కుటుంబాన్ని పరామర్శించి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండారు శంకర్, నాయకులు సూరి, నరసింహులు, దొడ్డప్ప, నాగమ్మ, శాంతి, పద్మావతి, ఆది పాల్గొన్నారు.

పి-4 సర్వేకు ప్రజలు సహకరించాలి

నార్పల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 (పబ్లిక్, ప్రయివేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్) సర్వేకు మండలంలోని ప్రజలందరూ సహకరించాలని ఎంపిడిఒ గంగావతి శనివారం ఒక ప్రకటనలో కోరారు. మండల, గ్రామస్థాయి నుంచి నిరుపేదలను ఆర్థికంగా బలోపేతమైన వ్యక్తులను చేయడంతోపాటు ఆర్థిక, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందన్నారు. కావున సర్వేలో ప్రజలు తమ వాస్తవ సమాచారాన్ని సచివాలయ ఉద్యోగులకు ఇవ్వాలని కోరారు.

తడి,పొడి చెత్తపై అవగాహన

నార్పల : ఇంటింటి నుంచి చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో శనివారం తడి, పొడి చెత్తపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి శైలజారాణి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇళ్లలో ఉండే చెత్తను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేసి ఇంటి వద్దకు వచ్చే పంచాయతీ వాహనాలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేష్, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, పరశురామ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్రబాబు, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు ఎడిఎంఎస్ మార్కెటింగ్ ప్రయివేట్ లిమిటెడ్, పేటీఎం, సిఐఇఎల్, ఈనాడు కంపెనీ ప్రతినిధులు హాజరై ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. కావున టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ఇరువర్గాల ఘర్షణ..ఆరుగురికి గాయాలు

ఉరవకొండ : విడపనకల్లు మండలం హావలిగి గ్రామంలో స్థల వివాదం నేపథ్యంలో రెండువర్గాలు ఘర్షణకు దిగాయి. పరస్పరం కర్రలతో కొట్టుకోవడంతో రెండువర్గాల్లో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరందరిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఓ ఇంటి పక్కన ఉన్న కొంత స్థలం కోసం కొంతకాలంగా ఇరువర్గాల మధ్య గొడవ జరుగుతోంది. ఈ విషయంలో గ్రామంలోని పెద్దలు వర్గాలకి నచ్చజెప్పి పంచాయితీ కూడా చేశారు. అయితే శనివారం నీరు తమ ఇంటి ముందుకు వస్తోందంటూ ఓ వర్గం వారు గొడవకు దిగడంతో పరస్పరం కర్రలతో కొట్టుకున్నారు. దీంతో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి..

పెద్దవడుగూరు : మండలంలోని చింతలచెరువు సమీపంలో శనివారం ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఉపాధ్యాయుడు రమేష్ గాయపడ్డాడు. రమేష్ కోనాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంలో వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డారు. గాయపడిన ఇతన్ని చికిత్స కోసం స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు రహంతుల్లా, రామసుబ్బయ్య, తదితరులు వెళ్లి పరామర్శించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు : మండలంలోని కాశేపల్లి టోల్‌ప్లాజా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 40 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఇక్కడి పంట పొలాల్లో పురుగుల మందు తాగి ఆపస్మారకస్థితిలో పడిపోయాడు. గమణించిన స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలనుంది.


బొలెరో, ప్రయివేటు బస్సు ఢీ

పెద్దవడుగూరు : మండలంలోని కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున ప్రయివేటు బస్సు బొలెరో వాహనాన్ని ఢీకొంది. హైదరాబాదు నుంచి బెంగళూరుకు వెళ్తున్న ప్రయివేటు ఒల్వోబస్సు ఇక్కడి రాగానే ముందు వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొంది. అయితే బస్సు డ్రైవరు అప్రమత్తం కావడంతో బస్సులోని ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

గుత్తి : పట్టణ శివారులో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురుకి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని స్వస్థతశాలకు వచ్చి తిరిగి వెళ్తుండగా పట్టణ శివారులోని అమోఘ్ హోటల్ వద్ద ఆటో టైరు పగిలి బోల్తా పడింది. ప్రమాదంలో కొప్పల కొండకు చెందిన నాగరాజు, అరవింద్, నల్లమ్మ, కల్లూరు అగ్రహారానికి చెందిన జయంతి, మారుతమ్మ, జయలక్ష్మితోపాటు పామిడికి చెందిన రమాదేవి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం పట్టివేత


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సిఐ సత్యబాబు

యల్లనూరు : మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకున్నట్లు సిఐ సత్యబాబు తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. యల్లనూరులోని మద్యం దుకాణం నుంచి మద్యాన్ని తీసుకుని తిమ్మంపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలిపారు. పక్కాగా సమాచారం రావడంతో దాడి చేసి తిమ్మంపల్లికి చెందిన బియ్యం రవికుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మడ్డిపల్లికి చెందిన పంతం సుధాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని 5,533 క్వాటర్ బాటిళ్లు, ఏడు కేసుల బీర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బొలేరో వాహనాన్ని సీజ్ చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.3.5 లక్షలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.